క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ఏటూరునాగారం: ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను (మంగళవారం) నేడు మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఫకీరా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక టాటా మ్యాజిక్, ఒక ద్విచక్ర వాహనం వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు 50శాతం డిపాజిట్ చెల్లించాలన్నారు.

బీమా చెక్కు అందజేత

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పుల్లూరి లింగరావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా మంజూరైన రూ.2లక్షల బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా చెక్కును ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి బాధిత సభ్యులకు సోమవారం అందజేశారు. మండల నాయకులు వాల యాదగరిరావు, తాజోద్దీన్ పాల్గొన్నారు.

భూమిని లాక్కోవడం సరికాదు

కాటారం: మండల కేంద్రంలోని మహదేవపూర్ వైపు ఓ ప్రైవేటు భూమిని ఆర్టీసీ అధికారులు బస్టాండ్ పేరిట లాక్కోవడానికి ప్రయత్నించడం సరికాదని చిద్నెపల్లి మాజీ ఎంపీటీసీ నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్వపు మహదేవపూర్ జమీందార్ ఊర కమల మనోహర్‌రావు 1945లో అతడికి ఉన్న భూమిని పేదలకు విరాళంగా అందజేశారని పేర్కొన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం మూడు ఎకరాల భూమిని విరాళంగా అందజేయడం జరిగిందని తెలిపారు. ఆస్పత్రిలోని కొంత భూమిని ఆర్టీసీ బస్సులు నిలుపుకునేందుకు వినియోగించుకోవాలని గతంలో సూచించినట్లు వివరించారు. కానీ అట్టి భూమిని ఆర్టీసీ అధికారులు వినియోగించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు 35 సర్వే నంబర్‌లో గల భూమి ఆర్టీసీకి చెందుతుందని అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. ఈ సర్వే నంబర్‌లో వంశపారపర్యంగా వచ్చిన 17 ఎకరాల భూమిపై ఊర నందకిషోర్, డాక్టర్ ఊర నందగోపాల్‌కు పూర్తి హక్కు ఉందని రెవెన్యూ రికార్డుల్లో సైతం వారి పేర్లే నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. ఊర రంగమ్మ ఆర్టీసీకి ఎకరం భూమి విరాళంగా ఇచ్చారనేది అవాస్తవం అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆర్టీసీ అధికారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని న్యాయపరంగా తాము ముందుకెళ్తున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


యాకూబ్ షరీఫ్ (ఫైల్)

మంగపేట: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్ షరీఫ్(30) తల్లి అబ్జల్‌బీ ఇంట్లో ఎలుకలు చేసిన రంధ్రాలకు పూడ్చేందుకు ఈ నెల 13న పక్కింటిలో ఉంటున్న ఆమె అక్క ఎండీ యాకుబీని సిమెంట్ అడిగి తీసుకుంటుంది. ఆ సమయంలో షరీఫ్ అక్కడికి వెళ్లి సిమెంటు అడుగుతున్నావంటూ తల్లితో గొడవ పడి చేయి చేసుకున్నాడు. తన మాటను లెక్క చేయడం లేదనే ఉద్దేశ్యంతో మనస్తాపం చెంది పరుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంలో చేర్పించారు. ఈ క్రమంలో వైద్యం పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫర్జానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అబయ్య తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

పొలంలో కుళ్లిన మృతదేహం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. తన పొలంలో మృతదేహం ఉందని ముచ్చర్లకు చెందిన ఓరుగంటి గణపతిరెడ్డి అనే రైతు పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం వల్లంకుంట గ్రామానికి చెందిన శేఖర్‌గా ధ్రువీకరించారు. శేఖర్ మతిస్థిమితం కోల్పోయి ముచ్చర్లకు చేరినట్లు పోలీసులు తెలిపారు.

ఒర్రెలో పడి గొర్రెలు మృతి

శాయంపేట : మేత కోసం వెళ్లిన సుమారు 50 గొర్రెలు ఒర్రెలో ఒకదానిపై మరొకటి జారిపడి మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని గోవిందాపూర్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. గొర్ల కాపరుల కథనం ప్రకారం.. పరకాల మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కిష్టబోయిన ఐల్లయ్య, ఓదెల ఓదేలు, మోర్రీ సుధాకర్‌లకు చెందిన సుమారు 200 గొర్రెలను మండలంలోని గోవిందాపూర్ శివారులోని పత్తి చేనులో మేపడానికి తీసుకెళ్లారు. రోడ్డు పక్కనే ఉన్న ఒర్రెను గమనించకుండా గొర్రెల మందను తోలడంతో అవి ప్రమాదవశాత్తు ఒకదానిపై మరొకటి పడి 50 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


శివాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ దేవేందర్

వెంకటాపురం(కె): మండలంలోని ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించారు. వైద్య శిబిరంలో ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, ఎంత మందికి కంటి అద్దాలు ఇచ్చారు అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు గ్రామంలోని అందరికి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివాపురంలో..

ఏటూరునాగారం: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శివాలపురం సర్పంచ్ వంక దేవేందర్ అన్నారు. సోమవారం మండలంలోని శివాపురం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పరిశీలించి మాట్లాడారు. అంధత్వ సమస్య ఉన్న వారు ఆధార్ కార్డు తీసుకొని వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి సమస్యలను ఈ శిబిరం ద్వారా నయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హసీనా, వైద్యాధికారులు భాస్కర్, స్వప్న, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ భాగ్య, ఏఎన్ఎంలు పుణ్యవతి, కవిత, ఆశ కార్యకర్తలు భవాని, వనజ, కవిత, రాణి, సరస్వతి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, కారోబార్ రమేశ్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మంగపేట మండలం తిమ్మాపూర్ పరిధిలో గత 30 సంవత్సరాలుగా 36 కుటుంబాలకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇచ్చిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ హక్కు కలిగి ఉన్నారని, కానీ పోడు భూములకు పట్టాలు లేవని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దావూద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఓకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా దావూద్ మాట్లాడుతూ.. గిరిజనులు గ్రామపంచాయతీలో ఇంటి పన్ను చెల్లిస్తూ పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నా అటవీహక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోగా కొంతమందికి మాత్రమే హక్కు పత్రాలు కల్పించి మిగతా వారికి పెండింగ్‌లో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పూనెం రాంబాబు, పూణెం నరేష్, సోయం చిలకమ్మా, సోయం రాము, మడవి శ్రీను, సోయం జ్యోతి, సోడి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు


మాట్లాడుతున్న ఎస్సై హరీష్

వాజేడు: బాలలను పనిలో పెట్టుకోవద్దని పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ అన్నారు. మండల పరిధిలోని పేరూరు రైతు వేదికలో రైతులతో సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్ట ప్రకారం నేరమన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వలస కూలీల్లో 14 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఉంటున్నారని అలాంటి వారిని పనిలోకి తీసుకెళ్లొద్దని సూచించారు. రైతులు ఎవరైన బాలలతో పని చేయించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ ఓంకార్, సర్పంచ్ సరస్వతితో పాటు తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం


ములుగు రూరల్: మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

ములుగు రూరల్: సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ, రైతుల రుణమాఫీ వంటి హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో సుభాశ్ నగర్ కాలనీలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ధరణితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీళ్లు, నిధుల, నియామకాల పేరుతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అవినీతి పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్రం నిధులతో వైకుంఠధామాలు, రైతు వేదికలు, సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణినాయక్, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, భూక్య రాజునాయక్, జవహర్‌లాల్, భిక్షపతి, కృష్ణాకర్, వాసుదేవరెడ్డి, రాకేష్‌రెడ్డి, గాదం కుమార్, రాజేష్, రవీందర్‌రెడ్డి , రవిరెడ్డి పాల్గొన్నారు.


వెంకటాపురం(కె): మాట్లాడుతున్న ఎంపీపీ సతీష్

రహదారిని మరమ్మతు చేయాలి

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలం నుంచి వాజేడు మండలం వరకు ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిని మరమ్మతులు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నూగూరు గ్రామంలో బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వలన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి సరిగా విద్యుత్ అందించకపోడండతో పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. అదే విధంగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమ సుందర్, మట్టి రమేష్ చంద్రరావ్, రవి , శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రశంస పత్రాల అందజేత


ప్రశంస పత్రాలను అందజేస్తున్న సంతోష్

ములుగు రూరల్: స్వచ్ఛభారత్ ఎయిర్ ఇండియా టాటా ప్రాజెక్టులో భాగంగా శానిటైజేషన్ ప్రోగ్రాంలో కరోనా సమయంలో పాల్గొన్న వారికి కేర్ ఇండియా వారు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ క్రమంలో గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన సర్పంచ్ ఈసం సమ్మయ్య, మండడి సుమలత, కందుకూరి సాంబయ్యలకు ప్రసంశ పత్రాలు రాగా మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ అవార్డు గ్రహీత రేండ్ల సంతోష్ సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పూర్ణచందర్, దర్శనాల సంజీవ బొడిగ రఘువీర్, మేడిపల్లి రమేష్ , కొమిరిశెట్టి వెంకన్న, వెంకన్న, సీఆర్పీలు రూప్‌సింగ్, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభాకర్

భూపాలపల్లి రూరల్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన తాటి వెంకట్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. దీంతో బాధితుడికి వైద్యఖర్చుల నిమిత్తం తాడి కార్పొరేషన్ నుంచి వచ్చిన రూ.15000లను సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించడానికి కృషి చేసిన బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, తాడి కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఏరుకొండ సంపత్, నాయకులు శ్రీపతి గోపి, నాగారం గ్రామ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

టేకుమట్ల(రేగొండ): మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధి పాటుపడాలన్నారు. వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఏలాంటి నీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండలంలోని గోరికొత్తపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్

మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ దగ్గు సంధ్యవెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. దీంతో వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు కో ఆర్డినేటర్ హింగే మహేందర్, జెడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయండి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి ఈ నెల 22న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించే హాథ్ సే హాథ్ జోడో యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. చల్లగరిగ గ్రామంలో రేవంత్‌రెడ్డి బస ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మంగళవారం రాత్రి చల్లగరిగ గ్రామంలో బస చేస్తారని తెలిపారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. చల్లగరిగ, జూకల్, తిర్మలాపూర్, చిట్యాల, నవాబుపేట, మీదుగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో కార్నర్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, మధువంశీ కృష్ణ, మూల శంకర్ గౌడ్, కర్రె పులేందర్ రెడ్డి, సర్వ శరత్ కుమార్, ఎంపీటీసీ దబ్బెట అనిల్, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్


డైరీ ఆవిష్కరిస్తున్న పీఓ అంకిత్

ములుగు రూరల్/ఏటూరునాగారం: తెలంగాణ హెల్త్ ఎడ్యుకేషన్, మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆవిష్కరించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ వైవీ.గణేష్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి(పంచాయతీ రాజ్)లతో కలిసి సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న వారికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన వైద్య సేవలపై ప్రజలకు వివరించేలా మాస్ మీడియా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఆర్ఓ రమాదేవి, ఇన్‌చార్జ్ డెమో తిరుపతయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల డైరీని ఐటీడీఏ కార్యాలయంలో పీఓ అంకిత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు కల్ల శ్రీనివాస్, కార్యదర్శి పులుసం శ్రీనివాస్, మానుకోట జిల్లా అధ్యక్షుడు గంగు, ఏసీఎంఓ ఈరులాల్, రాష్ట్ర బాధ్యులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, సారంగపాణి, మహిళా కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి గని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేటీకే 1వ గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. 11వ వేజ్ బోర్డు జేబీసీసీఐ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని, దేశ వ్యాప్తంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏరియాలో బ్యారెక్‌లో నివసిస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ ఇవ్వాలని, నూతన క్వార్టర్స్ కేటాయింపులో రాజకీయ జోక్యం లేకుండా కార్మికులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. భాస్కర్, సుజేందర్, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, సాంబయ్య, బత్తుల స్వామి, మల్లేష్, రాజిరెడ్డి రమేష్, మల్లేష్, శ్రీనివాస్, శంకర్, నారాయణ ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య డిమాండ్ చేశారు. సోమవారం బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుచ్చయ్య మాట్లాడుతూ.. భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు అనేక సమస్యలతో నలిగిపోతున్నారన్నారు. ఈ నెల 23న మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సింగరేణి కార్మికులు 250 గజాల సొంత ఇంటి స్థలం కేటాయించాలని, వడ్డీ లేని రూ.20 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. 8వ గనిలో పని చేస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ అమలు చేయాలని, గనుల్లో ప్రైవేట్ విభాగాలతో నడుస్తున్న కాంట్రాక్టులను రద్దు చేసి పూర్తిస్థాయిలో సింగరేణికే కేటాయించాలన్నారు. రాజేందర్, రఘుపతిరెడ్డి, అశోక్, మధుకర్‌రెడ్డి, వేణుగోపాల్, జనార్దన్, శ్రీనివాస్, కృష్ణ, లక్ష్మినారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ములుగు రూరల్: పరామర్శిస్తున్న గోవింద్‌నాయక్


గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంలో..


ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న ప్రవీణ్

ములుగు రూరల్: మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన కీసర రాజు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సోమవారం పరామర్శించి రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు బైకాని ఓదెలు, రూప్‌సింగ్, విజయ్‌పాల్‌రెడ్డి, సంపత్, సోమ్లా, రాజమౌళి, ఇంద్రారెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పల్లెబోయిన సునీత, బానోత్ జ్యోతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు నూనావత్ మహేష్‌నాయక్ సోమవారం పరామర్శించారు. గిరిజన సంక్షేమ సేవా సమితి జిల్లా యూత్ అధ్యక్షుడు జేపీనాయక్ జన్మదినం సందర్భంగా బాధిత కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించారు. రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై కర్ణాకర్‌రావు హాజరై మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చేయూతనందించడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రకరణ్, భూక్య మోహన్, ఎంపీటీసీ రామచందర్, రమేశ్, శ్రీకాంత్, లక్ష్మణ్, సురేష్, రాజునాయక్, తులసిరామ్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన తిరువాయిముడి రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ సోమవారం పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, బీఆర్ఎస్ పార్టీ ములుగు మండల యూత్ అధ్యక్షుడు బైకాని సాగర్, వినయ్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ విమల, సింగిల్‌విండో చైర్మన్ సోమ శాంతకుమార్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కనుకునూర్ నుంచి కేవలం 12 కిలోమీటర్ల దూరం ఉంటుందని అక్కడి వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనుకునూర్ సర్పంచ్ కుడుముల లక్ష్మి, జగపతినాయక్ తదితరులు ఉన్నారు.